శ్రీ శంకర
మహా మననము

లేఖకులు: శ్రీ శ్రీ శ్రీ సచ్చిదానందేంద్ర సరస్వతీ స్వాములవారు

అనువాదకులు: శ్రీ శ్రీ శ్రీ రామకృష్ణానందస్వాములవారు

ॐॐॐ

అధ్యాత్మ గ్రంథావళి.

శ్రీ శంకర మహా మననము

శాంకరసిద్ధాంతము యొక్క పూర్ణరూపమును తెలియచేయు ప్రకరణ

లేఖకులు:

శ్రీ శ్రీ శ్రీ సచ్చిదానందేంద్ర సరస్వతీ స్వాములవారు;

హొళేనరసీపురము.

ఓం

అనువాదకులు:

శ్రీ శ్రీ శ్రీ రామకృష్ణానందస్వాములవారు,

"గీతావాణి" సంపాదకులు.

శ్రీ భూమానందాశ్రమము, గండిక్షేత్రం (కడప జిల్లా).

ప్రకాశకులు:

అధ్యాత్మ ప్రకాశ కార్యాలయము,

హొళేనరసీపురము (573211)

(హాసన జిల్లా: కర్ణాటక రాష్ట్రం)

1974.

ఓం

**శ్రీ శ్రీ శ్రీ సచ్చిదానందేంద్ర సరస్వతీ స్వాములవారివల్ల వ్రాయబడి,
హొళేనరసీపుర అధ్యాత్మ ప్రకాశ కార్యాలయమునుండి
ప్రకాశింపబడిన సంస్కృత గ్రంథములు:**

	రూ.	పై.
మాండూక్యరహస్య వివృతి: వ్యాఖ్యాన రూపము.	12	00
సూత్రభాష్యార్థతత్త్వ వివేచని: (1 నుండి 3 భాగములు)	7	75
వేదాంత ప్రక్రియ ప్రత్యభిజ్ఞ (స్వతంత్ర గ్రంథము)	16	00
శుద్ధ శాంకర ప్రక్రియ భాస్కర: (1 నుండి 3 భాగములు)	1	60
వేదాంత విద్యాదోళి	2	75
పంచపాదికా ప్రస్థానం	4	00
నైష్కర్మ్య సిద్ధి	13	00
గీతా శాస్త్రార్థ వివేకము	2	25
విశుద్ధ వేదాంతసారము	1	25
విశుద్ధ వేదాంతపరిభాష	2	00
బ్రహ్మ విద్యారహస్య వివృతి	2	00

గ్రంథములు దొరుకుచోటు: అధ్యాత్మ ప్రకాశ కార్యాలయము

P. O. హొళేనరసీపురము, (573211) (హాసన జిల్లా: కర్ణాటక రాష్ట్రం)

%%%

శంకర మహా మననము

మొదటి ముద్రణము: 1974

1000 ప్రతులు.

All Rights Reserved by the
Adhyathma Prakasa Karyalaya, Holenarasipur.

దీని హక్కులన్నియు

అధ్యాత్మ ప్రకాశ కార్యాలయమువి.

ముద్రాపకులు:

శ్రీ బాలాజీ ప్రెస్,
వన్నియళార్ స్ట్రీట్, చిత్తూరు (ఆంధ్రప్రదేశ్).

బెంగుళూరు కార్యాలయ విలాసం.

ADHYATHMA PRAKASHA KARYALAYA,
BANGALORE BRANCH,
No. 68, II Block
Subbarama Chetty Lay-Out
P. O. Thyagarajanagara
BANGALORE - 28 (560028)

%%%

ప్రకాశకుల అభిప్రాయము

శ్రీ శ్రీ శ్రీ సచ్చిదానందేంద్ర మహాస్వాములవారు, తన పూర్వాశ్రమములో రచించిన యీ చిన్న గ్రంథము కన్నడదేశమెల్లెడల ప్రచారమైనది. దీనియొక్క ఉపయోగము ఆంధ్రభాషాభిమానులగు ముముక్షువులకు కావలయుననెడి సదుద్దేశముతో ఉదార మహాశయులొక్కరు ధనసహాయము చేసి, ఈ గ్రంథమును తెలుగుభాషలో అనువదించి ప్రకాశింపజేయవలయునని ప్రోత్సాహపరచినందువల్ల దీనిని ఆంధ్రభాషలో ప్రకాశింపజేయుచున్నాము.

శ్రీ భూమానందాశ్రమం గండి క్షేత్రం శ్రీ శ్రీ శ్రీ రామకృష్ణానంద స్వాములవారు మాయొక్క ప్రార్థన స్వీకరించి, యీ గ్రంథమును తెలుగుభాషలో ననువదించి, చిత్తూరు శ్రీ బాలాజీ ప్రెస్ మూలముగా అంద చందములతో ముద్రింపజేసి యిచ్చినందువల్ల మా అభినందనపూర్వక కృతజ్ఞతలను సమర్పించుచున్నాము. (Noto Sans Telugu 16)

ఆంధ్రభాషాభిమానులగు ముముక్షువులకు దీనివల్ల ఉపయోగము ఎంతవరకు కలుగుచున్నదో చూచుకొని, జనప్రియమగు ఇంకా కొన్ని గ్రంథములు తెలుగులో ప్రకటింపవలెననెడి గొప్ప ఆశయము గలిగియున్నాము. (Noto Sans Telugu Medium 16)

వై. నరసప్ప,

10-3-1974.

కార్యకారి సమితి అధ్యక్షులు,అధ్యాత్మ ప్రకాశ కార్యాలయం, హొళేనరసీపురం.

%%%

పీఠిక

ఈ చిన్న పుస్తకములో వేదాంత ప్రక్రియ రహస్యమంతా, శ్రీ శంకర భగవత్పాదులయొక్క అమృతవాణి ఆధారములోనే బయలుపరిచినాము. ఆచార్యులవారు చెప్పిన విషయములు, తన రచనా గ్రంథములలో దేనిలో తెలిపినారో దానిని తెలుసుకొనుటకుగాను, ఆ యా భాష్యముల అధ్యాయములయొక్క సంఖ్య చూపబడినది. బ్రహ్మసూత్రం, ఉపనిషత్తులు, భగవద్గీత అను ప్రస్థానత్రయ భాష్యములలో భగవత్పాదులవారు ఈ విషయమును సందర్భానుసారముగా మరి మరి చెప్పియుండుటవల్ల కొన్ని స్థలములు మాత్రం ఇచ్చుట చూపబడినవి. ఈ గ్రంథమునందు ఆచార్యులవారి మాటలను అక్షరశః నిరూపించియుండలేదు. ఆ యా అభిప్రాయములను తీసుకొని వేరే మాటలలో వ్రాయబడియున్నది. (Noto Serif Telugu 17)

ఈ పుస్తకము క్రొత్తగా చదివేవారికి వేదాంతముయొక్క పూర్తి ఉపదేశమున్ను, ఇంతకు ముందు చదివినవారికి అనుసంధానము చేయుటకు తగిన సంగ్రహమున్ను, కొంతమందికైనా ప్రయోజనము గలిగించునని నా యొక్క ఆశయము. (Anek Telugu 15)

అధ్యాత్మ ప్రకాశ కార్యాలయం, బెంగుళూరు శాఖ, బెంగుళూరు-560028

[గ్రంథకర్త.] తేది 10-3-1974.

%%%

సంకేతముల వివరము

ఉప. గ. ఉపదేశసాహస్రి, గద్యభాగము (పేరాసంఖ్య ఇవ్వబడినది.)

మాం. కా. గౌడపాదులు వ్రాసిన మాండూక్యకారికల యొక్క భాష్యము (సంఖ్యలను ప్రకరణ-కారికలు — ఇట్లు క్రమముగా ఇవ్వబడినది.)

గీ. భా. భగవద్గీతాభాష్యము (అధ్యాయ, శ్లోకముల సంఖ్య క్రమముగా ఇవ్వబడినది.)

బృ. భా. బృహదారణ్యకోపనిషత్తు యొక్క భాష్యము (అధ్యాయ, బ్రాహ్మణ, మంత్రములు ఇట్లు ఇవ్వబడినవి.)

అ. భా. మున్నుడి, బ్రహ్మసూత్రభాష్యమున ప్రారంభములో నుండు అధ్యాసభాష్యము.

మాం. భా. మాండూక్యోపనిషత్తు యొక్క భాష్యము (దీనికి మంత్ర సంఖ్య ఇవ్వబడినది.)

ముం. భా. ముండకోపనిషత్తు యొక్క భాష్యము (ముండక, ఖండ, మంత్ర — ఈ సంఖ్యలు క్రమముగా ఇవ్వబడినవి.)

కేవల సంఖ్య ఇవ్వబడినవన్నియు బ్రహ్మసూత్రభాష్య సంబంధమని తెలియవలెను. సంఖ్యలు క్రమముగా అధ్యాయము, పాదము, సూత్రము — వీటిని సూచించును. భా. భా. అను సంఖ్యలు శ్రీ జయచామరాజేంద్ర గ్రంథరత్నమాలలో ప్రకటింపబడిన ప్రస్థానత్రయ గ్రంథములయొక్క భాష్య భాగ సంఖ్యలను తెలియపరచును.

టిప్పణి: హొళేనరసీపురమువారి అధ్యాత్మ ప్రకాశ కార్యాలయమున ముద్రింపబడిన కన్నడ గ్రంథము యొక్క సంఖ్య. (పై సూచితము)

%%%

పారిభాషిక శబ్దముల అనుక్రమణిక

అజ్ఞానము	23	ప్రమాణ ప్రమేయ వ్యవహారము	35
అనుభవము	25	బంధము	28
అంత్య ప్రమాణము	35	బ్రహ్మము	2
అప్రమేయము	11	బ్రహ్మవిద్య	1
అవిద్య	6, 40	మాయికము	20
అశరీరము	18	మోక్షము	28
ఆత్మ	4	విచారము	8
ఇంద్రియములు	13, 14	విద్య	7
ఈశ్వరుడు	16, 17	విశేషజ్ఞానము	14
ఉపాసన	28, 30	విషయము	12
కర్తృత్వ భోక్తృత్వము	15	విషయి	12
కర్మ	23	శాస్త్రము	11
చైతన్యము	12, 14	శూన్యవాదము	9
నిత్యముక్తము	24	సంసారము	29, 42
నిత్యశుద్ధ బుద్ధముక్తము	41	సర్వజ్ఞము	31
పరమాత్మ	17	సర్వశక్తుడు	31
ప్రత్యక్షము	32	సాధనములు	42
ప్రపంచము	3	స్వతఃసిద్ధము	11
ప్రమాణము	10	స్వప్నము	20, 21
ప్రమేయము	11	స్వాభావికము	22

సూచన: ఇందు చూపబడిన సంఖ్యలు ఆయా గ్రంథ భాగముల సంఖ్యలు.

%%%

శ్రీ శంకర మహా మననము

Reflection 01

1. "బ్రహ్మవిద్య" యనిన బ్రహ్మమును తెలుసుకొనుట. బ్రహ్మము యొక్క నిజస్వరూపమును తెలుసుకొనునదే పరమపురుషార్థసిద్ధి. మనుష్యునికి కావలసిన ప్రయోజనములన్నిటిలో యిదే హెచ్చైనది. బ్రహ్మమును కనుగొన్న జనులకు, వారికున్న సర్వానర్థములు మొదలంట నశించిపోగలవు. (1-1-1; భా. భా. 18)

Reflection 02

2. బ్రహ్మమనిన యెప్పుడెప్పటికిని ఉండునదియును, పరిశుద్ధమైనదియును, జ్ఞానస్వరూపమైనదియును, యెట్టి బంధమునకును లోబడని స్వరూపము కలదియునునగు వస్తువు. ఇది యెఱుగని వస్తువు లేదు; అన్నింటిని యెఱుగుచున్నది యిదియే; దీనియందు లేని శక్తి లేదు. అన్ని విధములగు శక్తులును నున్నవి. (1-1-1; భా. భా. 19)

Reflection 03

3. మన యెదుటనుండు ప్రపంచమునందు వివిధ నామరూపములతో కూడియున్న పదార్థములు మనకు గోచరములగుచున్నవి; విధవిధములగు కర్మములనాచరించి, అవ్వాని ఫలములననుభవించుచున్న లెక్కకు మిక్కిలి జీవులున్నారు; జీవులాచరించు కర్మములకు యా స్థలమున, యా కాలమున, యిట్టి హేతువుచేతనే ఫలము కలుగవలెననెడి నియమము కూడ నున్నది.

దీనిని ఎవరు యే విధమున చేసియుండవచ్చునని మనస్సులో ఆలోచించుటకు కూడ అందని విషయమై యున్నది. ఇంతటి యీ ప్రపంచము తోచి అణగుటకు ఆధారమై యేది యున్నదో అదే బ్రహ్మము. (1-1-2; భా. భా. 24)

Reflection 04

4. ఈ బ్రహ్మము ఎవ్వరూ కానని ఎచ్చటో ఉండే వస్తువు కాదు. మన యొక్క స్వరూపమే అయియున్నది. మన నిజమగు స్వరూపమునకే ఆత్మయని పేరు. ఈ విధముగా మన ఆత్మయే బ్రహ్మమై యుండుటవలన ఆత్మవిద్యయే బ్రహ్మవిద్య. ఆత్మను తెలుసుకొన్నచో బ్రహ్మమును తెలుసుకొన్నట్లే యగును. (1-1-1; భా. భా. 19; మాం. 2)

Reflection 05

5. రోగముచేత బాధపడు వానికి రోగబాధ తొలగినచో వాడు తన మొదటి ఆరోగ్యస్థితిని పొందగలడు కదా! ఆ విధముననే సంసారదుఃఖమును అనుభవించుచున్న మనకు మన ఆత్మ బ్రహ్మమే యనియు, అది ఎప్పుడూ ఉండునదనియు, శుద్ధమైనదనియు, సంసారబంధ సంబంధమే కొంచెమును లేనిదనియు, చైతన్యమాత్రమనియు తెలిసినంతటనే దుఃఖములు సమూలముగా తొలగి మన యొక్క స్వభావస్థితి మనకు లభించుచున్నది. ఇదియే బ్రహ్మవిద్య యొక్క ప్రయోజనము. (మాం. 1; భా. భా. 2)

Reflection 06

6. ఆత్మయందు లేని సుఖదుఃఖములను దానియందు కల్పించుకొని, ఆత్మకు దేహేంద్రియ మనోబుద్ధి అహంకారముల సంబంధము తగులుకొనినదని అనుకొనుట అవిద్య. మన ఆత్మ నిత్యశుద్ధమైనదనియు, దానికి మరియొక వస్తువుతోడి సంపర్కము ఏమాత్రము లేదనియు, ఉండునను మాటకు ఆస్కారమే లేదనియు నిశ్చయించుట విద్య. (అ. భా. 4)

Reflection 07

7. "నేనున్నాను" —— అని ప్రతియొక్కడును తెలుసుకొనియున్నాడు; "నేను లేను" అని అనుకొనుట ఎవ్వనికిని లేదు. ఈ "నేను" అను వస్తువుయొక్క నిజస్వరూపమును తెలియవలెను. ఈ స్వరూపమే, అనగా ఆత్మయే బ్రహ్మము. ఆ కారణముచేత, బ్రహ్మమనెడి వస్తువు ఉన్నదో లేదో అను సంశయమునకు కారణమే లేదు. (1-1-1; భా. భా. 19)

Reflection 08

8. "నేను" అను వస్తువున్నదను విషయమునందు, యెవ్వరికిని సందేహము లేకపోయినను, "నేను" అను వస్తువు ఏది? యను విషయమును గురించి ఒక్కొక్కరి అభిప్రాయము ఒక్కొక్క విధముననున్నది. మన శరీరమందు తెలివియను గుణమున్నదనియు అదే చైతన్యమనియు ఆ చైతన్యముతో కూడిన దేహమే మన ఆత్మయనియు కొందరు భావించుచున్నారు. ఈ చైతన్యము యింద్రియములందున్నదనియు

అందువలన యింద్రియముల సమూహమే ఆత్మయనియు కొందరి అభిప్రాయము. ఈ బాహ్య ప్రపంచమంతయు యే మనస్సుకు గోచరించుచున్నదో, ఆ మనస్సే మన ఆత్మయని కొందరి మాట. మనస్సులో ఉప్పతిల్లు(పుట్టుకొచ్చే, ఉబికివచ్చే) విజ్ఞాన పరంపరల ధారయే మన ఆత్మ అని మరి కొందరి నిశ్చయము. ఆత్మ యనునది లేనే లేదని కొందరి నమ్మకము; దేహము, యింద్రియములు, మనస్సు, బుద్ధి —— వీటన్నింటికి వేరై జీవుడనబడు వాడొకడున్నాడనియు, కర్మలను ఆచరించి వాటి ఫలములను అనుభవించుటే వాని నిజమైన స్వరూపమనియు కొందరి నమ్మిక. జీవునికి సుఖదుఃఖములుండుట నిశ్చయమే అయినను వాడు నిజముగ యెట్టి కర్మమును చేయుట లేదనుట కొందరి మతము.

సంసారియగు జీవుడొక్కడే కాదు; వానికంటె వేరై యీశ్వరుడను ఒక ఆత్మ కలదనియు అతడే సర్వజ్ఞుడు, సర్వశక్తుడు అయియున్నాడనియు కొందరి అభిప్రాయము. మరి కొందరు ఆ సర్వజ్ఞుడు, సర్వశక్తుడూ అయిన యీశ్వరుడే మన ఆత్మయని చెప్పుచున్నారు.

ఈ విధముగనే, “నేనని తోచు వస్తువునకు నిజమైన స్వరూపమొకటి యున్నదా? లేదా? ఉన్నచో, అది దేహాదుల కంటె వేరా? ఒకటా? వేరైనచో, అది సుఖదుఃఖములను అనుభవించుచున్నదా? లేదా? అనుభవించునదైనచో, కర్మములను చేసి ఫలముననుభవించుచున్నదా? లేక, ఊరక ఊరక

సుఖదుఃఖములను అనుభవించుచున్నదా? సుఖదుఃఖములను అనుభవించుచున్నదనినచో, యెట్టి సుఖదుఃఖముల సంపర్కసంబంధమే లేని పరమాత్మ వస్తువొక్కటున్నదా? లేదా? ఉన్నచో, ఆ పరమాత్మకు జీవాత్మకు సంబంధమేమి?" అని యీ విధమున ఆరు సందేహములు విచారకులకు కలుగు అవకాశమున్నది.

ఈ సందేహములను నివారించుకొనక గ్రుడ్డిగ యేదో ఒక అభిప్రాయమునకు తలయొగ్గి నడచినచో, కలగవలసిన లాభము కలగకపోవుటయే కాక, కలుగకూడని అనర్థములు కలుగుట కూడనుండును. అందువలన ఆత్మవస్తువును గురించి విచారము చేయుట అత్యగత్యము(చాలా అవసరము). (1-1-1; భా. భా. 20)

Reflection 09

9. "నేను–నేను" అని జనులు వ్యవహరించుచుండుట నిజమే అయినను, 'నేను' అనెడి ఒక సత్యమైన వస్తువు ఏదియూ లేదు. ఇట్లు, బైట మనకు తోచు ప్రపంచము వ్యవహార రీత్యా ఆ విధముగ కనపడుచున్నదే కాని చక్కగా విచారించినచో దీనికిది స్వరూపమని ప్రమాణపూర్వకముగ నిరూపించుటకు వీలులేదు. అందువలన జీవుడు, జగత్తు, ఈశ్వరుడను వ్యవహారము వట్టి భ్రమమాత్రము. ఆ వాసనతో యోచించి యోచించి జనులు గుడ్డిదాటుగా ప్రపంచమొకటున్నది, జీవులనేకులున్నారు, ఈశ్వరుడొకడున్నాడని వ్యవహరించుచున్నారు కాని, పరమార్థమున యే ఒక్క

వస్తువును లేదు, యుక్తికి అందక కనపడుటే జగత్తుయొక్క లక్షణము” అని కొందరందురు. వీరినే శూన్యవాదులని అందురు.

ఈ వాదము జనుల అనుభవమునకు విరుద్ధమైనది. ఏదో ఒక పరమార్థము లేనిచో యీ విధముగ నిదంతయు తోచగలిగినదెట్లు? కనపడుచున్నది కాబట్టి యీ కనపడునది సత్యము అని నమ్ముటకు యోగ్యమైయున్నను దానిని భ్రాంతి యని చెప్పుటకు కారణమేమి? కనబడు జగత్తు యుక్తికి అనుకూలపడలేదు కాబట్టి భ్రాంతి అనుటకంటె, అనుభవమునందు కనపడు దానికి సరిపడలేదు కాబట్టి మన యుక్తియే తప్పుయియుండునని అనుకొనుట మేలుకాదా? ఇందువలన శూన్యవాదము ప్రమాణవిరుద్ధమగు మతము. దీనిని యెవ్వరూ నమ్మరు కాబట్టి ఈ మతమును ఖండించవలసిన పనిలేదు. (2-2-31; భా. భా. 64)

Reflection 10

10. మన ఆత్మయే లేదని చెప్పుట సరియైన మాట కాదు. ఎందుకనిన, ఆత్మ లేదని యెవ్వడు చెప్పుచున్నాడో వాని స్వరూపమే ఆత్మ. (1-1-4) ఆత్మ మరియొక ప్రమాణము ఆధారములో క్రొత్తగ సిద్ధమగు వస్తువుకాదు. అది సిద్ధమయే యున్నది.

దేని సహాయముతో తెలుసుకొనుచున్నామో అది ప్రమాణము. దేనిని తెలుసుకొనుచున్నామో అది ప్రమేయము. ఇది ప్రమాణము, యిది ప్రమేయము

—— అను వ్యవహారము పుట్టుటకుముందే ఆత్మయుండుట ఆవశ్యకమై యున్నది. ఎందుకనిన, ఆత్మయే ప్రమాణములద్వారా ప్రమేయములను తెలుసుకొనుచున్నాడు. ప్రమాణములద్వారా ప్రమేయములను తెలుసుకొనువాడే లేడని అన్నచో ప్రమాణప్రమేయవ్యవహారమే లేనిదగుచున్నది. అట్లే కానిమ్మని అన్నచో శూన్యవాదమును ఒప్పుకొన్నట్లగును. ఆ శూన్యవాదము అనుభవవిరుద్ధమైనది. ఎందుకనిన —— "సర్వమూ శూన్యము" అని నిర్ధారణ చేయుటకు కూడ ఆత్మ కావలసియున్నది. (2-3-7; భా. భా. 99)

Reflection 11

11. ప్రమాణములు రెండువిధములు. జనులందరును సామాన్యముగ ఉపయోగించుచుండెడి ప్రత్యక్షము, అనుమానము మొదలగునవి; లౌకిక ప్రమాణములకు చిక్కని వస్తువులను తెలిపెడి శాస్త్రము అలౌకిక ప్రమాణము. ఈ రెండు విధములైన ప్రమాణములకు లభ్యములగు వస్తువులన్నియు ప్రమేయములనబడును. కాని ఆత్మయే ప్రమాణమును అపేక్షింపక, ప్రమాణవ్యవహారమునకు తానే ప్రాణముపోయుచున్నందున ఆత్మ అప్రమేయుడని చెప్పబడినది. ఆత్మ ప్రమేయము కానిదని, స్వతస్సిద్ధమైనదని, ప్రమాణముల అపేక్ష లేక స్వతః ప్రసిద్ధమైయుండునదని తెలిసినవారు చెప్పెదరు. (2-3-7 భా. భా. 99; గీతా 2-18 భా. భా. 29)

Reflection 12

12. ఆత్మ దేహమునకంటె వేరుగ లేదనియు దేహమున్నప్పుడే తెలివి కనపడుచున్నది కాబట్టి చైతన్యము దేహముయొక్క ధర్మమని కొందరు భావింతురు. ఇది సరికాదు. ఎందుకనిన, దేహము జ్ఞానమునకు విషయమగుచున్నది. ఏది ప్రకాశింపజేయుచున్నదియో అది విషయి; దేనిని ప్రకాశింపజేయుచున్నదో, అది విషయము. జ్ఞానము, దేహము మొదలగువాటిని తెలుసుకొనుచున్నది కాబట్టి జ్ఞానము విషయి, దేహాదికములు విషయము. విషయి విషయముయొక్క ధర్మము కాజాలదు. దీపము తాను ప్రకాశింపజేయు ఘటముయొక్క ధర్మము కాదు. దేహమునందలి ధర్మములు తాము తమ తమ స్వరూపమును కాని ఒక్కటి మరొక్కదాని ధర్మమునుకాని తెలియ లేవు. జ్ఞానము దేహమునూ దాని సమస్తధర్మములనూ తెలుసుకొనుచున్నది. అందువలన జ్ఞానమనునది దేహధర్మము కాదు. ఇంతేగాక, దేహముండిననే జ్ఞానముండునను నియమమూ లేదు. స్వప్నమున ఈ దేహము లేకున్నను జ్ఞానమున్నదనుట అందరికి తెలిసిన మాట. అందువలన దేహమునకంటె జ్ఞానము వేరు. జ్ఞానమునే చైతన్యమందురు. అదే ఆత్మ. (3-3-54 భా. భా. 418)

Reflection 13

13. ఆత్మ ఇంద్రియాదులను తెలుసుకొనుచుండుట వలన విషయములైన యింద్రియముల ధర్మమే ఆత్మ యనెడి మాట

అనుభవవిరుద్ధమైన మాట. "దీనిని మూచూచుచున్నాను(ముక్కుతో వాసన పసిగట్టడం)" అని వ్యవహరించునప్పుడు, మూచూచి వాసనను తెలుసుకొనువాడు ఆత్మ. ముక్కు అను యింద్రియము వాసనను తెలుసుకొనుటకు సాధనము. కర్త కరణమునకంటె వేరై యుండవలయును కదా! కన్ను చెవి మొదలైన వాటియందు గల యింద్రియములు ఆయా విషయములను తెలుసుకొను కరణములు. వాటి సహాయమున తెలుసుకొను చైతన్యమే ఆత్మ. అందువలన ఆత్మ యింద్రియాలకంటె వేరే. (2-3-18 భా. భా. 124)

Reflection 14

14. ఆత్మ దేహమునకంటెను యింద్రియములకంటెను వేరుగనున్నట్లే మనస్సుకంటెను వేరయియున్నది. గాఢ నిద్రలో దేహముండుట లేదు. ఇంద్రియములుండుట లేదు. మనస్సుండుట లేదు. (1-1-9 భా. భా. 85, 2-3-40 భా. భా. 152) అప్పుడు యెట్టి జ్ఞానమూ లేదు కాబట్టి ఆత్మ లేదని చెప్పవలెనా? అనిన నిద్రలో తనకంటె వేరైన రెండవ వస్తువు లేదు కాబట్టి విశేషజ్ఞానము లేదే కాని తానుకూడ లేకపోవుట లేదు. (బృ. 4-3-23) "నేను" అను జ్ఞానము కూడ లేనందువలన ఆత్మ కూడ లేదనుట సరియని తోచవచ్చును. అయినను, "సుషుప్తిలో ఏమీలేదు" అనునది కూడ ఒక అనుభవమే. ఆ అనుభవమే చైతన్యరూపమగు ఆత్మ —— 'నేను' ఇది, అనెడి తెలివికి విశేషజ్ఞానమని పేరు. ఇది ఆత్మకంటె వేరైన వస్తువులు ఉన్నప్పుడు

మాత్రమే తోచును. కాని, 'నిద్రలో నాకేమీ తెలియలేదు' అను అనుభవము వలన రెండవ వస్తువే లేదని సిద్ధమగుచున్నది. అంతేకాని, నిద్రలో తానే లేనని పట్టు పట్టినచో నిద్రయను అవస్థే లేదని చెప్పినట్లగును; ఇది లోకానుభవమునకు విరుద్ధము. అందువలన, ఆత్మ, దేహేంద్రియమనోబుద్ధి అహంకారములకంటె వేరైన చైతన్య స్వరూపి యని గాఢ నిద్రయొక్క అనుభవమున నిర్ణయమగుచున్నది. (ఉప. గ. 2, భా. 56.)

Reflection 15

15. ఆత్మ కర్తృభోక్తృరూపమైనదా? కాదా? కర్మములను చేసి ఫలమును పొంది అనుభవించుటనునది మన ఆత్మకు స్వభావమా కాదా? ఈ శంకకు రెండు విధములైన సమాధానములున్నవి: ఒక దృష్టిలో ఆత్మకు కర్తృత్వ భోక్తృత్వములున్నవి; మరొక దృష్టిలో లేవు. బాడిస(బాడిశ,Adze) మొదలగు పనిముట్లను ఉపయోగించునప్పుడు మాత్రమే మనుష్యుడు వడ్రంగి యని అనిపించుకొనును; లేనప్పుడు అందరివలెనే మనుష్యుడు. అట్లే శరీరేంద్రియములతో కూడుకొని ఉండు జాగ్రత్ స్వప్నములలో ఆత్మకు కర్తృత్వము భోక్తృత్వము నున్నది; నిద్రలో యెట్టి సాధనములు లేనందువలన ఆత్మ కర్తయు కాదు; భోక్తయు కాదు. మొత్తమునకు చూచినచో కర్మములను చేసి ఫలములను అనుభవించుటనునది ఆత్మయొక్క స్వభావమునకు సంబంధించినది కాదు, అని చెప్పియే తీరవలెను. (2-3-40 భా. భా. 152)

Reflection 16

16. ఆత్మకు కర్తృత్వమున్నప్పుడు, మనమే కర్మములను చేయుచున్నామా? లేక మనలను కర్మలో ప్రవర్తింపజేయు పరమేశ్వరుడొక్కడు వేరే యున్నాడా? మనము కర్మఫలములను అనుభవించునప్పుడు కర్మమువలననే ఫలము వచ్చుచున్నదా? లేక ఫలము నొసగు యీశ్వరుడొక్కడున్నాడా? అను సంశయము కలుగును. అట్టి యీశ్వరుడొక్కడున్నాడు; శరీరేంద్రియాదికములే తానని భావించి అవిద్య యను ఆవరణముతో ముందు కానక యుండువాడు జీవుడు. జీవుల కర్మములకు అధ్యక్షుడై సకల ప్రాణులందును నివసించి సాక్షియై చైతన్యరూపమై యుండువాడు యీశ్వరుడు. జీవుడు చేయు ధర్మాధర్మములు, వాటి ఫలమూ యీశ్వరుని అనుగ్రహముననే నడచును. (2-3-41, 42; భా. భా. 155; 3-2-39; భా. భా. 314; గీ. 13-22, భా. భా. 273; ము. 3-1-1, భా. భా. 91)

Reflection 17

17. కర్మచేసి ఫలము ననుభవించు జీవునికి యీశ్వరునికి సంబంధమేమనిన, జీవుడే యీశ్వరుడు. దేహాదికములు నేననెడి భ్రాంతిజ్ఞానముండువరకు జీవులమగు మనకంటె యీశ్వరుడు వేరుగనే యుండును. నిజము నెఱిగినచో జీవత్వమే లేదు. ఎందుకనిన ఈశ్వరుడు యెప్పుడెప్పుడూ మన పరమాత్మయైయున్నాడు. అనగా పరమార్థమైన మన

స్వరూపమైయున్నాడు. (గీ. 13-2, భా. భా. 216; గీ. 13-22, భా. భా. 273; గీ. 15-19, భా. భా. 382; 1-1-6; 1-3-19; భా. భా. 75; 274.)

Reflection 18

18. జీవుడు నిజముగ పరమాత్మయే యనెడి విషయమునందు అనేక సంశయములు వచ్చును. జీవుడు చావు పుట్టుకలు కలవాడు; అట్టివాడు చావుపుట్టుకలు లేని పరమాత్మ యనిన సంగతమెట్లగును? అనునది మొదటి సంశయము.

అయినను, చక్కగ విచారించినచో జీవుడు నిజముగ పుట్టుటయు లేదు; చచ్చుటయును లేదు. శరీరము పుట్టుచున్నది. చచ్చుచున్నది. పాతగుడ్డను తీసివేసి క్రొత్తగుడ్డను కట్టుకొన్నంత మాత్రమున మనుష్యుడు వేరేవాడగుచున్నాడా? లేదు. అట్లే, శరీరము పుట్టినచో జీవుడు పుట్టుట లేదు. శరీరము పడిపోయినచో జీవుడు చచ్చుటయూ లేదు. (గీ. 2-22, భా. భా. 44; 2-3-16, భా. భా. 118; 2-3-17, భా. భా. 121)

Reflection 19

19. జీవునికి శరీరము, యింద్రియములు, ప్రాణము, మనస్సు, బుద్ధి, అహంకారము —— వీటి సంబంధమున్నది. ఇట్టి జీవుడు యెట్టి శరీరమూ లేని పరమాత్ముడగుట యెట్లు? అనునది రెండవ సంశయము.

నిజము విచారించినచో, జీవునికి శరీరాదికములు ఉన్నవనుటకు ప్రమాణము లేదు. శరీరాదికములన్నియు విషయములై యున్నవి. తాను విషయియై యున్నాడు. విషయియగు తనకు విషయములగు శరీరాదికముల సంబంధమున్నదని తలంచుట న్యాయముకాదు. ఒక కుండ మనజ్ఞానమునకు విషయమై యుండవచ్చును. అంతమాత్రమున ఆ కుండయే మన స్వరూపమని కాని, ఆ కుండ మనకు సంబంధపడి యున్నదని కాని, మన మనుకొనుట లేదు. అట్లే శరీరాదికములు మనకు సంబంధపడి యున్నవనుటకు యెట్టి ప్రమాణమును లేదు. శాస్త్రములందు "ఆత్మ అశరీరి" అని చెప్పబడియున్నది. (క. 1-2-22, భా. భా. 78; గీ. భా. 13-13, భా. భా. 254; 1-1-4 భా. భా. 58)

Reflection 20

20. జీవాత్మకు దేహాదికములు సహజమైయున్నవని భావించుటయూ తప్పే, ఎందుకనిన — స్వప్నములో యా దేహాదికములు యేవీ ఉండుటలేదు. అచ్చట కేవలము మాయికములగు దేహాదులతోడనే వ్యవహారము జరుగుచున్నది. జాగ్రత్తకును స్వప్నమునకును యెట్టి భేదమును చూపుటకు వీలులేదు. కాబట్టి, యిది జాగ్రత్, యిది స్వప్నము అని విడమరచి తెలియ వీలులేదు. కాబట్టి, జాగ్రదవస్థలోని దేహాదికములు కూడ మాయికములే. ఈ మాయిక దేహాదికముల సంబంధము ఆత్మకున్నదని

చెప్పుటకు వీలే లేదు. (3-2-3 భా. భా. 256; కా. 2-4 భా. భా. 81; కఠ. 2-5-11, భా. భా. 148)

Reflection 21

21. జీవులు అనేకులు; వారందరు తమకు దేహాదికములున్నవని ఒప్పియున్నారు. ఒక జీవుడు తనకు స్వప్నములో మాయిక దేహాదికములున్నవని తెలిసినంత మాత్రమున అందరూ అంగీకరించిన జాగ్రత్తలోని శరీరాదికములు జీవునికి లేవనుట యెట్లు? జీవులు అనేకులు; పరమాత్మ ఒక్కడు. ఈ అనేకులగు జీవులు ఒక్కడగు పరమాత్మ యగుట యెట్లు? అనునది మూడవ సంశయము.

అవును. జాగ్రత్తలోవలెనే స్వప్నములోకూడ కర్తలు, భోక్తలు అనేకులగు జీవులున్నట్లును సమష్టిగా వ్యవహారము చేయుచున్నట్లును కనపడుట లేదా! అంత మాత్రమున అచ్చట తోచు జీవులను, వారి శరీరాదులను సత్యమని మనము నమ్ముచున్నామా? లేదు. అట్లే జాగ్రదవస్థలోని జీవులను, వారి శరీరములను తెలియవలెను. స్వప్నమునందు ఒకే ఆత్మ అనేకముగ తోచుచున్నది. జాగ్రదవస్థయందు కూడ అంతే యని తెలియవలెను. (2-1-28; భా. భా. 465; కా. 4-37; భా. భా. 278)

Reflection 22

22. మాయిక దేహాదికముల సంబంధమైనను జీవునికి ఉండనేయున్నది కదా? అనినచో అదికూడ ఆత్మకు స్వభావము కాదు. ఆత్మ దేహాదికముల

సంబంధమును పూర్తిగా వదలి స్వాభావికమైన బ్రాహ్మీస్థితియందే ఉండుట గాఢనిద్రలో మనందరి అనుభవమైయున్నది. అదియుగాక, ప్రయత్నపూర్వకముగ సమాధిస్థితిని పొంది ఈ బ్రహ్మస్వరూపమును దర్శించవచ్చునని శాస్త్రములందు చెప్పబడియున్నది. (3-2-7; భా. భా. 270; 3-2-24, భా. భా. 299)

Reflection 23

23. నిద్రయందుకాని సమాధియందుకాని "నేను బ్రహ్మమైయున్నాను" అనెడి జ్ఞానము ఉండుట లేదు. "నాకు అప్పుడు యేదియూ తెలియదు" అని మేల్కొన్న తరువాత తెలియుచున్నాడు. అందువలన నిద్రయందుకాని సమాధియందుకాని జీవునికి అజ్ఞానమున్నట్లే అయినది. ఇట్టి జీవుడు సర్వజ్ఞబ్రహ్మమెట్లు కాగలడు? అనునది నాల్గవ సంశయము.

అయినను, నిద్రయందు "నేనిట్టివాడ"నని తెలియకుండుటకు తానొక్కడే యుండుట కారణముకాని అక్కడ అజ్ఞానముండుట కారణముకాదు. ఎందుకనిన — "నేనేమీ తెలుసుకొనుట లేదు" అనినప్పుడు యితరమగు రెండవ వస్తువును తెలుసుకొనుట లేదని అర్థము కాని తన జ్ఞానస్వరూపమే లేదని అర్థము కాదు. "ఇది యిట్టిది, ఇది యిట్టిది" అని విడివిడి జ్ఞానము నిద్రలో లేనిమాట నిజమే. అప్పుడు యింద్రియములు లేవు కాబట్టి ఆ విడివిడి తెలివి లేదు. అదే కారణముకాని, ఆత్మస్వరూపమగు తెలివి లేకపోవుట కాదు. (బృ. 4-3-21; బృ. 4-3-23)

Reflection 24

24. జీవునికి జాగ్రత్స్వప్నములలో దేహాదికముల సంబంధమున్నది. నిద్రలో లేదు. ఈ విధమున దేహాదికముల సంబంధమును పడయుచు విడుచుచు నున్నవాడు నిత్యముక్తుడని యెట్లు చెప్పబడుననునది అయిదవ సంశయము.

దేహాదికములు పరమార్థముగ లేనేలేవు. జాగ్రత్స్వప్నములలో అవి ఉన్నట్లు తోచుచున్నవి. అన్ని అవస్థలను ఆత్మ సాక్షియై చూచుచున్నాడు అని వెనుక చెప్పబడినది. ఆత్మచైతన్యము యెప్పుడెప్పుడూ మార్పులేక ఒకే రూపమున నుండుట చేతనూ, మాయికములగు దేహాదికముల వికారములు యేవిధముగను ఆత్మచైతన్యమునకంటవు కావునను, ఆత్మ నిత్యముక్తమని చెప్పుటకెట్టి ప్రతిబంధకమును లేదు. (మా. 7; కా. 2-32, భా. భా. 115)

Reflection 25

25. జీవుడు పరమాత్ముని అంశయని శాస్త్రములందున్నది కదా! శాస్త్రప్రమాణమును కాదని జీవుడే పరమాత్మయని చెప్పనగునా? అనునది ఆరవ సంశయము.

శాస్త్రము ప్రత్యక్షాదులవలెనే ప్రమాణమైయున్నది కాబట్టి ప్రమాణస్వభావము కలదైయున్నది. ప్రమాణమనిన ఉన్న దానిని ఉన్నట్లు తెలుపుసాధనము; ఏ సాధనము లేనిచో మనకు ఆ విషయము తెలియదో, ఆ సాధనము ఆ విషయమున ప్రమాణమనబడుచున్నది. ప్రమాణము ఉన్న దానిని

తెల్పునేకాని లేనిదానిని తెచ్చిపెట్టలేదు. శాస్త్రము ఆత్మవిషయమున ప్రమాణమగుచున్నది. అది ఆత్మవిషయమున మనకు సంశయమును అజ్ఞానమును భ్రమను కలిగించక తెల్పినచో ప్రమాణమగునేకాని అనుభవవిరుద్ధముగ తెల్పినచో ఎప్పుడూ ప్రమాణము కాలేదు. మన ఆత్మ బ్రహ్మస్వరూపమన్నది అనుభవసిద్ధము. ఆత్మయే బ్రహ్మమని శాస్త్రమునందును చెప్పబడినది. అనుభవవిరుద్ధమైయున్న యే వాక్యమునకును ప్రామాణ్యత సిద్ధించదు. (బృ. 2-1-20, భా. భా. 315; గీ. 18-66, భా. భా. 600)

Reflection 26

26. అట్లైనచో జీవుడు పరమాత్ముని అంశయని శ్రుతియందును స్మృతియందును చెప్పబడినది కదా! ఆ మాటకు గతియేమి? అని అడుగవచ్చును. 'జీవుడు పరమాత్ముని అంశము' అనిన, సూర్యుని ప్రతిబింబము సూర్యుని అంశమన్నట్లు, మిణుగురులు అగ్ని అంశమనినట్లు, ఘటాకాశము మహాకాశము యొక్క అంశమనినట్లు అర్థము గ్రహించవలెను. అనగా, అదే జాతికి చెందినదని తెలుసుకొనవలెను. ప్రతిబింబములు అనేకమైయున్నను బింబము ఒక్కటే అయియున్నట్లు జీవులు అనేకులైనను వారి ఆత్మ నిజముగ నొక్కటే; జీవుడు స్వరూపతః చైతన్యమే; మిణుగురులు నిప్పూ ఒకటే అయియున్నట్లు జీవులూ బ్రహ్మమూ ఒకే చైతన్యమయ్యే ఉన్నారు. ఘటాకాశము, గృహాకాశము అని వ్యవహారములో ఆకాశములను అనేకముగా చెప్పిననూ ఆకాశము ఒక్కటే అయియున్నట్లు, జీవులు అనేకులని

వ్యవహారమున్నను వారి స్వరూపమగు బ్రహ్మమొక్కటియే. ఈ విధముగ తెల్పుటయే అంశవాక్యముల ఉద్దేశము. (2-3-43, భా. భా. 158; 2-3-50, భా. భా. 168; 3-2-18, భా. భా. 285; బృ. 2-1-20, భా. భా. 316; కా. 3-3-7, భా. భా. 132, 142)

Reflection 27

27. జీవుడు పరమాత్ముని అంశమనెడి వాక్యముల వాచ్యార్థమునే గ్రహించినచో దోషమేమి? వినుము. అంశమనెడి మాటకు అర్థము అవయవమనియో వికారమనియో శక్తియనియో అవస్థయనియో చెప్పవలసియుండును. పరమాత్మయందు అనేక భాగములున్నవనియూ వాటిలో ప్రతియొక్కటియూ జీవుడనియూ కల్పించినచో, అవయవములు చేరుకొని ఉన్నప్పుడు మాత్రము అవయవి ఉండి, అవి విడివడిపోయినప్పుడు వెంటనే నశించిపోవునట్లు, పరమాత్మకు కూడా అదే గతి కల్గవలసియుండును. అది ఒప్పదగిన మాటకాదు. అందువలన జీవుడు పరమాత్ముని అవయవముకాదు. ఇక, జీవుడు పరమాత్ముని వికారమనినచో — అనగా, మన్ను మారి కుండ అయినట్లు పరమాత్ముడు మార్పుచెంది జీవుడైనాడనుచో — అప్పుడుకూడ పరమాత్మునికి నాశము ఒప్పక తప్పదు. అందువలన జీవుడు ఆత్మయొక్క వికారము కాదు. సర్వశక్తుడగు యీశ్వరుడు బంధమునకు లోబడుననుట సరిగాదు కాబట్టి జీవుడు యీశ్వరుని శక్తియనుటయు ఒప్పదగినదికాదు. పరమాత్ముడు మొదట పరిశుద్ధుడై

దుఃఖహీనుడై యుండి, ఆ తరువాత అశుచియూ దుఃఖమయమునూ నగు సంసారమును పొందెనని చెప్పుటయు సమంజసముకాదు కాబట్టి జీవుడు పరమాత్ముని అవస్థ అనుటయు పొసగదు. అందువలన 'జీవుడు పరమాత్ముని అంశ' మనెడి వాక్యమునకు అక్షరార్థము చెప్పుకొనుట పొసగదు. (బృ. 3-8-12, భా. భా. 94)

Reflection 28

28. ఇది విహితము, యిది నిషిద్ధమని శాస్త్రమునందు జీవునికి చిత్తశుద్ధికొరకు కర్మలు చెప్పబడినవి; ఈశ్వరుని అనుగ్రహమును సంపాదించుటకు ఉపాసన చెప్పబడినది. మోక్షమును పడయుటకు అనుకూలమైన జ్ఞానము చెప్పబడినది; జీవుడే బ్రహ్మమైనచో ఈ సాధనములన్నియు వ్యర్థమగును కదా! అనునది యేడవ సంశయము.

దీనికి పరిహారమేమనిన — శాస్త్రమునందు — మోక్షమునకు ఉపాయము జ్ఞానమని చెప్పియుండుట చేత, బంధము అజ్ఞానము వలన కల్గినదనియే సిద్ధమగుచున్నది; ఎందుకనిన, అజ్ఞానమును నివారించుటే జ్ఞానముయొక్క పని కాని, లేని దానిని కల్గజేయుట కాదు. దేహాదులే తామని భ్రమించు అజ్ఞానులకు శాస్త్రమునందు కర్మలను ఉపాసనలను చెప్పినంత మాత్రమున, పరమార్థ దృష్టితో ఆత్మయే బ్రహ్మమని చెప్పిన సిద్ధాంతమునకు యిబ్బంది యేమియు లేదు. (1-1-4, భా. భా. 51; 2-3-48, భా. భా. 164, 165; బృ. 2-1-20, 323)

Reflection 29

29. దేహాదుల సంబంధమును పెట్టుకొనియే కర్మాదికములు విధింపబడియుండును. కావచ్చును. అందు ఆ దేహాదికములు ఉండనేయున్నవి కదా! వాటిని తప్పించుకొనుట కాదు కదా! అట్టి యెడ ఈ దేహాదికముల సంబంధమున కల్గిన అజ్ఞానమును నశింపజేసుకొనుటకు ఉపాయము లేకపోయెనే —— అనిన దానికి సమాధానమున్నది. దేహాదికములు నిజముగ లేవు. చక్కగ విచారించి చూచినచో ఆత్మనే దేహాదికములని మనము వ్యవహరించుచున్నాము కాని, అవి వెలుగునందుటకు మరి యే ఆధారమున నుండుట లేదని తెలియుచున్నది. జాగ్రతయందుకాని స్వప్నమునందుకాని వస్తువులు ఆత్మచైతన్యమునకు వశమైయుండి గోచరించుచున్నవేకాని చైతన్యమును వదలి స్వతంత్రముగ యే వస్తువులును గోచరించుట మనమెరుగము. సూర్యుడు జగత్తును వెలిగించినట్లు దేహాదులనెల్ల ఆత్మచైతన్యమే వెలిగించుచున్నది. సుషుప్తి సమాధి మొదలగు అవస్థలలో దేహాదికములుండుట లేదు. అందువలన, దేహాదులు —— వాటి సంబంధమూ —— దానివలన కలుగు సంసారమూ ఆత్మయందు పరమార్థముగ లేదు. (బృ. 2-4-7, భా. భా. 361; గీ. 18-33, భా. భా. 299; గీ. 18-50, భా. భా. 556; గీ. 18-66, భా. భా. 598)

Reflection 30

30. బ్రహ్మమును ఉపాసన చేయవలెననియు దానియందు సర్వకర్మములు సర్వకామములు సర్వగంధములు సర్వరసములు యింకను అనేక ధర్మములు ఉన్నవనియు శాస్త్రమునందు చెప్పబడియున్నది. ఉపాసనము చేయు జీవుడే బ్రహ్మమైనచో తన్ను తానే ఉపాసించుకొన్నట్లగును కదా! జీవునియందు బ్రహ్మము యొక్క గుణములలో యే గుణమూ కనపడుటలేదు! శాస్త్రప్రమాణము సంగతము కాలేదే! దీనికేమి గతియని యనుట ఎనిమిదవ సంశయము.

ఆత్మవిచారమునకు అనర్హులును వివిధములగు దృష్టాదృష్ట ఫలములను కోరువారును నగు అజ్ఞానులను ఉద్దేశించి శాస్త్రమునందు ఉపాసన చెప్పబడినదని వెనుకనే చెప్పియున్నాము. దేని దేనిని ఉపాసన చేయుచున్నావో అది బ్రహ్మము కాదనియు, దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధులను విషయము చేసుకొనుచున్న చైతన్యమే బ్రహ్మమనియు శాస్త్రమందు స్పష్టముగ చెప్పబడియున్నది. తాను ఉపాసన చేయు బ్రహ్మము తన స్వరూపమున కంటే వేరని తెలియుట తగదనియు శాస్త్రము చెప్పినది. అందువలన ఉపాసనయందు చెప్పియున్న బ్రహ్మస్వరూపమున శాస్త్రమునకు తాత్పర్యము లేదు; ఉపాధుల ధర్మములనే అచ్చట బ్రహ్మధర్మములని చెప్పబడినది; ఉపాధులెల్లను బ్రహ్మమునందు కల్పితమై యుండుటవలన వాటిని

బ్రహ్మధర్మములని ఉపచారమునకు చెప్పినట్లు తెలియవలెను. (గీ. 2-14, 15, భా. భా. 281; బృ. 1-4-10, భా. భా. 82)

Reflection 31

31. బ్రహ్మము సకల జగత్తుయొక్క సృష్టి స్థితి లయములకు కారణమైనదనియు బ్రహ్మము సర్వజ్ఞము — సర్వశక్తిమంతము అనియు శాస్త్రమున చెప్పబడినది. జీవుడు జగత్తును సృష్టి చేయలేడు. జీవునికి తెలియని విషయములు ఎన్నో ఉన్నవి. జీవునితో కాని పనులెన్నో ఉన్నవి. ఇట్లున్నప్పుడు జీవుడే బ్రహ్మమని చెప్పుట తగునా? అనునది తొమ్మిదవ సంశయము.

దీనికి పరిహారమేమనిన — జాగ్రత్ స్వప్నములలో తోచు ప్రపంచము ఆయా అవస్థలకు మాత్రము పరిమితమై అగపడుచున్నది. అప్పుడది ఆత్మచైతన్యమునకు అధీనమైయే అగపడుచున్నది. నిద్రలో యే జగత్తును లేదు. ఆత్మయందు అణగిపోవుచున్నది. ఇంతకును యీ జగత్తు ఆత్మయందే బయలుదేరి కనబడి అణగిపోవుచున్నది. ఈ కారణము చేత జగత్తులన్నిటిని సృష్టి చేయు శక్తి ఆత్మయందున్నదని తెలిసినది. కనపడు ప్రపంచమంతయు ఆత్మచైతన్యమునకు విషయమై యుండుటవలన ఆత్మ సర్వజ్ఞుడనుటయు ఒప్పినమాటే.

అయినను, బ్రహ్మము జగత్కారణమని సర్వజ్ఞమని సర్వశక్తివంతమని చెప్పుటకూడ అజ్ఞానదృష్టితోనే తప్ప పరమార్థతః కాదు; ఎందుకనిన,

బ్రహ్మమున కంటె వేఱై యే వస్తువు కూడ లేనే లేదనుటయే పరమార్థము. (మాం. 1-6, భా. భా. 29; 2-1-14, భా. భా. 418; 2-1-33, భా. భా. 426)

Reflection 32

32. బ్రహ్మమొక్కటే నిజముగనుండు వస్తువైనచో బ్రహ్మమును తెలిసికొనవలెననుకొనువాడు వేరుగ లేనట్లే అయినది; ప్రత్యక్షమే మొదలగు ప్రమాణములు నిజమగు ప్రమాణములు కాకనే పోవుచున్నవి; శాస్త్రమునందు చెప్పిన కర్మములు ఉపాసనలు వ్యర్థమగుచున్నవి; బ్రహ్మవిద్యను అభ్యసించు శిష్యుడు కాని బోధించు గురువు కాని నిజముగ లేకపోవుటచేత జ్ఞానశాస్త్రమూ వ్యర్థమగుచున్నది. ఇట్లు వ్యవహారమునంతటిని ఉఫ్ అని ఊది పారవేయుట యోగ్యమేనా అని పదవ సంశయము.

"బ్రహ్మమొక్కటే నిజముగనుండు వస్తువైనచో" అని మొదటనే సంశయమును సూచించుటకు ఆస్కారము లేదు; ఎందుకనిన, బ్రహ్మమొక్కటే నిజముగ నుండునదనియు అదే మనయొక్క ఆత్మయనియు యుక్తి అనుభవములచేత ఈ వరకే సిద్ధమైయున్నది. ప్రత్యక్షమే మొదలగు ప్రమాణములు జాగ్రదవస్థలో నడచు వ్యవహారమునకు చేరినవి; అవి బ్రహ్మవిషయమున నేమియు చెప్పుటలేదు. అందువలన వాటికెట్టి బాధయు లేదు. శాస్త్రము చెప్పిన కర్మలు ఉపాసనలు శ్రేయఃకారకములందు సత్యత్వబుద్ధి

కలిగిన అజ్ఞానులను ఉద్దేశించి పుట్టినవని వెనుకనే చెప్పియున్నాము. (బృ. 2-1-20, భా. భా. 319, 324)

Reflection 33

33. కలలో కనబడినది మెలకువలో అబద్ధమైపోయినను కలలో నిజముగనే యుండును. ఈ విధముననే, జ్ఞానుల దృష్టిలో బంధము లేదు, మోక్షము లేదు, సాధకుడును లేడు, సాధనమును లేదు, ముముక్షువులును లేరు; సృష్టి లేదు, స్థితి లేదు, ప్రళయమును లేదు. దీనిని తెలుపుటకు శాస్త్రము పని లేదు, అక్కడ శాస్త్రము శాస్త్రము కాదు. ఇట్లున్నను అజ్ఞానుల దృష్టిలో యివన్నియు సత్యమే. అందువలన కర్మలు కాని శాస్త్రములు కాని జ్ఞానము కాని వ్యర్థమగుట లేదు; ప్రమాణ ప్రమేయ వ్యవహారమూ సత్యమైయుండును. (2-1-14, భా. భా. 436; కా. 2-3-2, భా. భా. 113; బృ. 2-1-20, భా. భా. 326)

Reflection 34

34. ప్రమాణములూ శాస్త్రమూ పరమార్థములే అని చెప్పవలెనే కాని అజ్ఞానుల దృష్టిలోనే సత్యమని చెప్పుట సరికాదు. అజ్ఞానముతో సత్యమనిన అవి ప్రమాణమెట్లగునని పదునకొండవ సంశయము.

దీనికి పరిహారమేమనిన — ప్రమాణమనునది నిజమగు అనుభవమునకు సాధనము. ఇంద్రియములు మొదలగునవి యిట్టి సాధనములగుట బట్టి అవే ప్రమాణములని చెప్పబడుచున్నవి. ఇంద్రియములు

దేహమును అవలంబించియున్నవి. దేహమును తానని కాని తనదనిగాని అనుకొనని వాడు ప్రమాత కాలేడు. ప్రమాతయనిన ప్రమాణముల నుపయోగించి విషయవస్తువుయొక్క నిజమును తెలియ ప్రయత్నించువాడు. అయితే, ఆత్మయందు దేహము కాని యింద్రియములు కాని నిజముగ లేవు కాబట్టి ఆత్మ ప్రమాతయనబడదు. ఆత్మయందు దేహాదుల సంబంధమున్నదని కల్పించుకొన్న తప్ప ఆత్మ ప్రమాత కాజాలదు కాబట్టియు ప్రమాత లేక ప్రమాణ వ్యవహారము జరుగదు కాబట్టియు దేహాదుల సంబంధమును కల్పించుకొనుట యను అజ్ఞానమే అన్ని ప్రమాణములకు పునాది యగుచున్నది. అందువలన ప్రమాణములు అజ్ఞానస్థితిలోనే సత్యములని చెప్పినమాట అబద్ధము కాదు. (అ. భా. 5)

Reflection 35

35. ప్రమాణములని చెప్పబడు ప్రత్యక్షాదులను శాస్త్రమును వదలినచో నిజమును తెలుసుకొను సాధనములు మరి లేవుకదా! ఆయెడ నిజమును తెలుసుకొనుట యెట్లు? ప్రమాణమైన శాస్త్రముకూడ అజ్ఞానముతో సత్యమైనదైనప్పుడు ఆ శాస్త్రమువలన సిద్ధించు బ్రహ్మవిద్య చెప్పు జ్ఞానముకూడ అజ్ఞానములోనికే చేరిపోవును కదా! ఆ బ్రహ్మవిద్య సరియని నమ్ముట యెట్లు? అనునది పండ్రెండవ సంశయము.

ఆత్మ తానే సిద్ధమైయుండు వస్తువు కాబట్టి దాని నెఱుగుటకు మరే ప్రమాణమును పనిలేదని యీ వరకే చెప్పబడినది. ఆత్మ కాని దానిని ఆత్మయని

అనుకొన్నప్పుడు “అది ఆత్మకాదు” అని శాస్త్రము చెప్పుచున్నది; శాస్త్రము అంతమట్టుకే ప్రమాణము. అయినను, ప్రమాణ ప్రమేయ వ్యవహారము అజ్ఞానమేనని శాస్త్రమే చెప్పివేసినది కాబట్టి శాస్త్రమువలన ఆ జ్ఞానము కల్గిన మీదట శాస్త్రము కూడ ప్రమాణము కాకపోవుచున్నది. కాబట్టి దాని ప్రామాణ్యమునకు యెట్టి బాధకమును లేదు. ఇట్లు ప్రమాణ వ్యవహారమే తప్పు తెలివిచేత కల్గినదని శాస్త్రము తెలిపియుండుట చేత శాస్త్రమునకు అంత్యప్రమాణమను పేరు చెల్లినది. (2-1-14, భా. భా. 486; గీ. 2-18, భా. భా. 29; బృ. 4-4-20)

Reflection 36

36. మోక్షాదులు అబద్ధము, ప్రమాణవ్యవహారము అజ్ఞానదృష్టిలో మాత్రము సత్యము, శాస్త్రము కూడ అజ్ఞాన దశయందే ప్రమాణము —— అని కనబడినదంతను అబద్ధమనుట కంటెను ‘ప్రత్యక్షాదులు నిజము; శాస్త్రము కూడ ప్రమాణమే; బంధాదులును నిజమే; శాస్త్రమునందు చెప్పినట్లు సాధనములనాచరించి బంధమును పోగొట్టుకొనిన సత్యమగు మోక్షము జీవులకు లభించును’ అని చెప్పు అభిప్రాయమే మేలు కాదా? అనునది పదమూడవ సంశయము.

బంధము సత్యమై యున్నచో జ్ఞానముతో నివారింపబడుట పొసగదు. అది, యే సాధనమైనను కూడ ప్రాప్యమై యుండు ఫలమును యిచ్చుటయేకాని సత్యవస్తువును నశింపజేయజాలదు; వస్తువుయొక్క పరమార్థరూపమును

మార్చలేదు. క్రొత్తగ వచ్చిన దానిని నిత్యముగ నిలుపుటకును వీలుకాదు; ఈ విషయములను జ్ఞప్తియందుంచుకొనినచో బంధము సత్యముగ నుండవలెనను అభిప్రాయము తొలగిపోవును. (బృ. 4-4-6)

Reflection 37

37. బంధము నిజము, దానిని తొలగించుకొనవలెను; మోక్షము నిజము, దానిని పడయవలెను(పొందవలెను, సాధించవలెను, అందుకోవలెను); అనెడి వాదము నిలుచునదికాదు. ఎందుకనిన — పరమాత్ముని కంటె వేరుగ బంధమునకు వశుడై యున్న జీవుడు యెవడూ లేడు. ఇప్పుడూ నిజముగ బంధములోనే ఉన్న జీవుడు ఆ తర్వాత ముక్తుడు కాగలడని చెప్పినచో, క్రొత్తగ కలుగు ముక్తియు అనిత్యమే యగును. ఆత్మ ఆయా సంస్కారములను బొంది ముక్తికి అర్హుడగునని అనుకొనరాదు. ఎందుకనిన — సంస్కారమనిన గుణమును కలిగించుట, దోషమును తొలగించుట కదా! అట్లయిన, ఆత్మలో లేని ఆత్మకంటె వేరె యుండు గుణమేదియు లేదు; ఆత్మయందు యెట్టి దోషమును లేదు. అందువలన సంస్కారవశమున మోక్షము వచ్చుననుట సరికాదు. బ్రహ్మము మరొకచోటనున్నదని మనమచ్చటికి దానిని పడయవలెననుటకూడ సరికాదు; బ్రహ్మము సర్వవ్యాపి కాబట్టి దానిని క్రొత్తగ సంపాదించుకొనవలసినదేమియూ లేదు. (1-1-4, భా. భా. 49; గీ. 18-66, భా. భా. 585; బృ. 4-4-6)

Reflection 38

38. మోక్షము యే యితర సాధనములతోడను కలుగుట లేదనినను జ్ఞానము కల్గినప్పుడు కలుగుచున్నదని ఒప్పవలెను. దానిని బట్టి మోక్షము జ్ఞానకార్యమైనది. కార్యములన్నియూ అనిత్యములగుట తప్పనప్పుడు జ్ఞానకార్యమగు మోక్షము కూడా అనిత్యమే యగును కదా! అనునది పదునాలుగవ సంశయము.

మోక్షము జ్ఞానముతో కలుగుట లేదు. కల్గియున్న మోక్షమే జ్ఞానమువలన తెలియబడుచున్నది. సరియగు తెలివి యనిన ఉన్నదానిని తెలుపు జ్ఞానమేకాని లేనిదానిని కల్పించునదికాదు. అందువలన మోక్షము నిత్యసిద్ధమైనదై జ్ఞానముతో గోచరమగునది కాబట్టి దీనిని జ్ఞానకార్యమని ఉపచారమునకు చెప్పబడినదని తెలియవలెను. (మాం. 7, భా. భా. 89; 1-4-4, భా. భా. 47; బృ. 3-3-1)

Reflection 39

39. ఆత్మకంటె వేరుగ బ్రహ్మము లేనిచో బ్రహ్మమే సంసారియని చెప్పవలసి వచ్చును కదా! అనునది పదహారవ సంశయము.

సంసారము నిజముగ యెవ్వరికిని లేదనుటయే సిద్ధాంతము. ఆత్మ బ్రహ్మమేనని ఆత్మయందు యెట్టి సంసారమును లేనే లేదనియు అనుభవపూర్వకముగ నిరూపించబడినది కాబట్టి, బ్రహ్మము సంసారియని శంకించుట యే విధముగను సరిపోదు. అందువలన

సంసారమున్నదనుకొనుటే అజ్ఞానము. (1-2-8, భా. భా. 162; గీ. 13-2, భా. భా. 217)

Reflection 40

40. అట్లయిన ఆత్మకు అజ్ఞానముండవలసియున్నది కాబట్టి బ్రహ్మమునకును అజ్ఞానముండినట్లే కదా! అజ్ఞానమున్న బ్రహ్మమును తెలుసుకొనుటవలన మనకు కాగల్గినదేమున్నదనుట పదునేడవ సంశయము.

దీనికి పరిహారమేమనిన —— ఆత్మ అవిద్యను తన జ్ఞానమునకు విషయముగ తెలియుచున్నాడు; దానివలన, అజ్ఞానము ఆత్మకంటె వేరేయగుచున్నదే కాని, అది ఆత్మయొక్క ధర్మము కాదు. కుండను యెఱుగు వానియందు కుండయొక్క ధర్మములు ఉండునా! ఉండవు. ఇట్లే, అవిద్యాదులన్నియు అనాత్మలే కాని ఆత్మకాదు. ఆత్మస్వరూపమగు చైతన్యములో యెట్టి అవిద్యయు లేదు. సుషుప్తి, సమాధి మొదలగు అనుభవముల వలన ఈ స్వరూపమును గుర్తించవచ్చునని ఇదివరకు చెప్పబడియేయున్నది. (బృ. 4-4-6, గీ. 13-2, భా. భా. 218)

Reflection 41

41. అట్లైనచో, అజ్ఞానము యెవ్వరికిని లేదు, సంసారము యెవ్వరికిని లేదు —— అని చెప్పినట్లైనది కదా! ఇక శాస్త్రమువలన కూడ కాగల్గినదేమున్నది? అనునది పదునెనిమిదవ సంశయము.

అజ్ఞానముగాని సంసారముగాని యెవ్వరికిని లేదనియు మన ఆత్మ నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వరూపమనియు తెలుసుకొన్న తర్వాత శాస్త్రమువలన కావలసిన దేమియు లేదు. దీనిని తెలియని వారికి మాత్రమే శాస్త్రము కావలసియున్నది. (బృ. 1-4-10, భా. భా. 154; 4-1-3, భా. భా. 510)

Reflection 42

42. ఇట్టి బ్రహ్మవిద్యవలన కాగల్గినదేమి? బ్రహ్మజ్ఞానులనువారు కూడా తదితరులవలెనే సంసారులయ్యే ఉన్నారు కదా! అనునది పందొమ్మిదవ సంశయము.

నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వరూపమగు బ్రహ్మమే తానని తెలుసుకొన్న జ్ఞానియు తాను కర్మలనాచరించి తత్ఫలములననుభవించు సంసారినని భావించుననుకొనుట హాస్యాస్పదమగు మాట. ఎందుకనిన — శరీరాదికములు తాననుకొనిన వానికే శరీరాదులకు అనుకూలమును అపేక్షించుటయు ప్రతి కూలములను ద్వేషించుటయు, శరీరాదుల క్లేశనాశ విషయమున భయమును; యే విధముగనైనను వాటిని రక్షించుకొనవలెనను మోహమును, ఒక దానివెంట నొకటి అంటుకొనియుండును. ఈ విషయము సంసారులగు వారికందరికి తెలిసిన విషయమే. ఈ అనర్థముల గుంపే సంసారము. అయినను, యీ దేహాదికములు తాను కానేనియు అవి పరమార్థముగ లేనే లేవనియు తన స్వరూపము నిత్యమై శుద్ధమై జ్ఞానస్వరూపమైనదనియు యెట్టి బంధమును లేనిదనియు తెలుసుకొన్న జ్ఞానికి

పైన చెప్పిన సంసారమున్నదనవచ్చునా? అందువలన, సంసారసంబంధమగు సకల విధమగు అనర్థములును లేకపోవుటయే బ్రహ్మవిద్యకు ఒక ప్రయోజనము. జ్ఞానియైన వాడు తనకుగా చేసుకొనవలసినది యేమియు లేదు; వదలవలసినదియు యేమియు లేదు. అందువలన వాడు యితరులవలె యెట్టి తాపత్రయములకు లోనుగాక, శాంతుడై యుండును. ఈ పరమశాంతి బ్రహ్మవిద్యకు మరొక్క ప్రయోజనము. (1-1-4, భా. భా. 57; గీ. 3-17, భా. భా. 174; 18, భా. భా. 175)

Reflection 43

43. ఈ బ్రహ్మజ్ఞానము అందరికి కల్గుట లేదు కదా! ఇదే నిజమైన తెలివియగుచో అందరికిని యా విధముననే యెందుకు తెలియుటలేదు? ఈ విషయము జనులకింతగా చర్చాస్పదమెందుకైనది? అనునది యిరువదవ సంశయము.

ఈ జ్ఞానము అందరికి కల్గదనుమాట నిజమే. వారు దానిని అపేక్షించకుండుటయే దానికి కారణము. దేహాభిమానమును వదలి శమము దమము ఉపరతి తితిక్ష శ్రద్ధ సమాధానము అను సాధనములను సంపాదించి వేదాంతశాస్త్రమునందు చెప్పిన ప్రకారము బ్రహ్మనిష్ఠులగు గురువుల ఉపదేశమును పొంది దానిని గురించి ఆలోచించి చూచినప్పుడు అవశ్యముగ జ్ఞానము కల్గుచున్నది. (1-1-1, భా. భా. 18; గీ. 2-21, భా. భా. 40; 18-50, భా. భా. 557)

Reflection 44

44. బ్రహ్మజ్ఞానమువలన మన జ్ఞానము తప్పని తెలుసుకొన్నచో, బ్రహ్మజ్ఞానమునకంటె మరొక్క ప్రబలమైన జ్ఞానము కలిగినప్పుడు దీనిని తప్పని తెలుసుకొందుమేమో! అట్టియెడ యిదే సరియైన తెలివియని నిశ్చయించుట యెట్లు? అనునది యిరువది యొకటవ సంశయము.

ఆత్మ ఒక్కటే పరమార్థమనునది బ్రహ్మజ్ఞానము. ఈ బ్రహ్మజ్ఞానము కల్గిన తరువాత దానికంటె వేరే రెండవ వస్తువే లేదు కాబట్టి బ్రహ్మజ్ఞానమును బాధించు మరొక్క జ్ఞానము కల్గునని చెప్పుటకు అవకాశమే లేదు. ఇదే అంతిమజ్ఞానము. దీని తరువాత సంశయముకాని ప్రమాణజ్ఞానముకాని కల్గుటకు వీలులేదు. (కా. 1-18, భా. భా. 57; 2-1-14, భా. భా. 438)

Reflection 45

45. దర్శనకారులందరును తమ తమ సిద్ధాంతమే సరియని వివిధములగు యుక్తులను చూపింతురు; శాస్త్రవాక్యముల నుదహరింతురు. అట్టియెడ ఆ దర్శనములు సరికాదని చెప్పుట యెట్లు? అనునది చివరి సంశయము.

మిగిలిన దర్శనకారులు చెప్పు యెన్నో విషయములు యుక్తి ప్రమాణములు లేని వట్టి కల్పనలు మాత్రమే యున్నవి. జనులు వాటిని ఒప్పవలసినదే కాని అవి లోకమున అనుభవమునకు వచ్చుటకు వీలు లేదు. వారు చెప్పు ముక్తియను పరమ ప్రయోజనము కాలాంతరమున జనులు చచ్చిన

తరువాత వచ్చునదై యున్నది. అది నమ్మకమునకు వస్తువే కాని అనుభవమునకు వచ్చు వస్తువుకాదు. వారు చెప్పు విషయములందు కొన్ని అనుభవమునకు వచ్చునవి కూడ కావచ్చును; నిజము; కాని అవి జనుల అనుభవములో ఒక అంశమగు జాగ్రదవస్థ యొక్క అనుభవమును మాత్రమే గ్రహించినప్పుడు ఉపయోగపడుచున్నవి. బ్రహ్మాత్మస్వరూపమును చెప్పు వేదాంత దర్శనమట్లు కాదు. జ్ఞానము కల్గిన వెంటనే యిప్పుడే యిక్కడే ఆత్మస్వరూప సాక్షాత్కారమగుచున్నదని ఆ శాస్త్రము చెప్పుచున్నది. ఇప్పుడే అనుభవమునకు వచ్చు విషయమును చెప్పుచున్న యీ దర్శన సిద్ధాంతమును అందరూ పరిశీలింపవచ్చును. జాగ్రత్తు, స్వప్నము, సుషుప్తి యనెడి అన్ని అనుభవములను యిచ్చట లెక్కకు తీసుకొని చూచి పరమార్థమై సత్యమై యుండు వస్తువు యేదియని పరిశీలింపవలసియున్నది. ఏ యుక్తికిని యే శాస్త్రమునకును యిది విరోధము కాదు. ఈ విధమున తక్కిన దర్శనములకంటె వేదాంత దర్శనమున గొప్ప విశేషతమున్నది. (1-1-4, భా. భా. 216; కా. 4-2, భా. భా. 54)

Reflection 46

46. ఈ బ్రహ్మవిద్య అన్నింటికి మించిన ప్రయోజనము నిచ్చు తెలివి కాబట్టి బుద్ధిమంతులూ ముముక్షువులూ అయిన జిజ్ఞాసువులు దీనిని ఆదరించుచున్నారు. ఈ విద్యవలన బ్రహ్మాత్మస్వరూపమును కనుగొనినవాని సర్వసంశయములు పరిహారమగుచున్నవి; హృదయగతమగు అజ్ఞానమున

సంభవించు కామనలు వాడినించి పోవుచున్నవి; వాడు తెప్పించుకోవలసినది కాని తప్పించుకోవలసినది కాని లేదు; తప్పనిసరి చేయవలసిన పనులు వానికేమియు మిగిలి లేవు. (ముం. 2-2-9, భా. భా. 83; ము. 3-2-9, భా. భా. 123)

END

%%%

BOOKS IN ENGLISH

By Sri Sri Sri Swamy Satchidanandendra
Saraswathiji of Holenarsipur

1.	Narada's Aphorisms on Bhakti	0–50
2.	Avasthatraya or the Unique Method of Vedanta	0–40
3.	How to Recognize the Method of Vedanta	2–25
4.	Vedanta or the Science of Reality (Original author: Sri K. A. Krishnaswamy Iyer)	20–00
5.	Suddha-Sankara-Prakriya-Bhaskara (Parts 1 to 3)	3–00
6.	Salient Features of Sankara's Vedanta	2–50
7.	Collected Works of K. A. Krishnaswamy Iyer	6–00
8.	Sankara's Clarifications of Certain Vedantic Concepts	1–50
9.	Essays on Vedanta	6–00
10.	Misconceptions About Sankara	3–00
11.	The Vision of Atman	2–00
12.	The Upanishadic Approach to Reality	2–25
13.	Intuition of Reality	3–00

For a fuller list of books, please apply to:

ADHYATMA PRAKASHA KARYALAYA,
P. O. Holenarsipur (573211)
(Hassan Dt., Karnataka State)

%%%

అధ్యాత్మ ప్రకాశ కార్యాలయము,

హొళేనరసీపురము, (స్థాపితము: 1920)

సంస్థాపకులు: శ్రీశ్రీశ్రీ సచ్చిదానందేంద్ర సరస్వతీ మహాస్వాములవారు, (పూర్వాశ్రమములో)

పరిపాలకులు: శ్రీ జయచామరాజేంద్ర ఒడయర్ బహద్దూర్, జి. సి. బి., జి. సి. ఎస్. ఐ., మహాస్వాములవారు.

అధ్యాత్మ విద్యయందు, జనులకు చాల అభిరుచిని కలిగించుట ద్వారా భారత సంస్కృతియొక్క ప్రచారమునకు సహాయపడుటయే ముఖ్యోద్దేశము. కన్నడము, ఇంగ్లీషు, సంస్కృతము, తెలుగు మరియు మరాఠీ భాషలలో నూట అరవైయైదు అధ్యాత్మ గ్రంథములు ప్రచురింప చేయబడినవి. కార్యాలయమునందు అధ్యాత్మ కార్యక్రమములు ఎప్పుడూ చేయవలెననెడి ఉద్దేశ్యములో 1970 సంవత్సరములో కార్యాలయశాఖ బెంగుళూరులో తెరవబడినది.(Noto Sans Telugu 16)

'అధ్యాత్మ ప్రకాశం' అనెడి కన్నడ మాసపత్రిక 43 సంవత్సరముల నుండి నడుపబడుచున్నది.

బెంగుళూరు శాఖ కార్యాలయ విలాసము:—

ADHYATMA PRAKASHA KARYALAYA, BANGALORE BRANCH,
No. 68, II Block, Subbarama Chetty Lay-Out, P. O. Thyagarajanagara
BANGALORE-28 (560028)

%%%

ఓంఓంఓం